సాక్షి వికారాబాద్

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



గ్యారెంటీలు అమలుచేస్తాం

రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్ అన్నారు. 14లో▸



నమ్మినవారే.. ముంచారా?

ప్రజా నాయకుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి(పీఎన్‌ఆర్‌)ని నమ్మిన వాళ్లే నట్టేట ముంచారు. 14లో▸



యోధుడికి పట్టాభిషేకం

ప్రజలు పోరాట యోధుడు రేవంత్‌కు పట్టం కట్టారు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ రేవంత్‌రెడ్డికి ఆధిక్యత ఇచ్చారు. 15లో▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ అలా బోణీ కొట్టింది

ఎల్బీనగర్, మహేశ్వరంలో తొలిసారిగా విజయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే కాదు, తర్వాత అధికారంలో ఉండగా జరిగిన ఎన్నికల్లోనూ ఆ రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ ఖాతా తెరవలేక పోయింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఆరు స్థానాల్లో విజయం సాధించారు. మహేశ్వరం, ఎల్బీనగర్‌లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు గెలవలేక పోయారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన అభ్యర్థులే.. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరపున అదే స్థానాల నుంచి పోటీ చేశారు. ఆశించిన దానికంటే అత్యధిక ఓట్లు సంపాదించి విజయం సాధించారు.

మహేశ్వరంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది. తొలి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున పటోళ్ల సబితారెడ్డి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత అప్పట్లో చోటు చేసుకున్న పలు రాజకీయ సమీకరణాలతో ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో నిర్వహించిన తొలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి ఇదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ తరపున పోటీలో నిలిచిన టీకేఆర్ ఓటమి పాలై, కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల సబితారెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆమె కాంగ్రెస్‌ను వీడి అధికారపార్టీలో చేరి మంత్రిగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నిల్లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచి, ఆ పార్టీకి తొలిసారిగా విజయం సాధించి పెట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ బీఆర్‌ఎస్ ఖాతా తెరవలేదనే ప్రచారానికి చెక్ పెట్టారు.

ఎల్బీనగర్‌లో..

అప్పటి వరకు మలక్‌పేట్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఎల్బీనగర్ 2009లో కొత్త నియోజకవర్గంగా ఆవిర్భవించింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీడీపీ నుంచి ఎస్వీ కృష్ణ ప్రసాద్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, టీడీపీ నుంచి ఆర్.కృష్ణయ్య పోటీ చేయగా కృష్ణయ్య గెలుపొందారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ముద్ద గోని రామ్మోహన్‌గౌడ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌ను వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023లో బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలిచారు. ఇప్పటి వరకు ఇక్కడ గెలుపొందని కారు పార్టీకి ఆయన తొలి విజయాన్ని అందించారు.

చేవెళ్లలో హోరాహోరీ

- రీకౌంటింగ్ కోరిన కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్
- ఐదు బూత్‌లలో మరోసారి లెక్కింపు

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో హోరాహోరి పోరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య గెలుపొందారు. ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో హ్యాట్రిక్ విజయం అందుకున్నారు. హిమాయత్‌సాగర్‌లోని లార్డ్స్ కాలేజీలో 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదటి రౌండ్ నుంచి కాలె యాదయ్య స్వల్ప ఆధిక్యంతో కొనసాగారు. పదో రౌండ్ వరకు 6,900 పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించారు. 10వ రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు కాంగ్రెస్ స్వల్ప మెజార్టీ సాధిస్తూ వచ్చి బీఆర్‌ఎస్ లీడ్‌ను 544కు తగ్గించింది. 20 రౌండ్‌లో యాదయ్యకు 700 పైచిలుకు ఓట్ల మెజార్టీ రావడంతో ఆయన మెజార్టీ 1,200 దాటింది.చివరి రెండు రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు స్వల్ప మెజార్టీ రావడంతో యాదయ్య మెజార్టీ 800 పైచిలుకుకు తగ్గింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 590 ఓట్ల లీడ్ వచ్చినా ఆయనకు ఓటమి తప్పలేదు. చివరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్య 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు.

రీకౌంటింగ్‌కు కాంగ్రెస్ అభ్యర్థి పట్టు

బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్యకు 268 ఓట్ల మెజార్టీ రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ రీకౌంటింగ్ చేయాలని అధికారులను కోరారు. ఐదు పోలింగ్ బూత్‌ల కౌంటింగ్‌పై అనుమానం ఉందని.. ఆ పోలింగ్ బూత్‌లలో పోలైన ఓట్లకంటే కౌంటింగ్ సమయంలో ఓట్లు తక్కువగా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ఐదు పోలింగ్ బూత్‌లలో రీకౌంటింగ్ చేశారు. మొత్తం రీకౌంటింగ్ చేయాలని భీంభరత్ పట్టుబట్టగా అధికారులు మాత్రం మొత్తం చేయలేమని తేల్చి చెప్పడంతో ఆయన కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. అధికారులు బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్య గెలుపొందినట్లు ధ్రువపత్రం అందజేశారు.



వికారాబాద్ ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రసాద్‌కుమార్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

క్లీన్ స్వీప్

ఎన్నికల సమరం ముగిసింది. రెండు నెలలపాటు సాగిన ఈ పోరులో ఫలితాలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా వచ్చాయి. హోరాహోరీగా సాగిన ఉత్కంఠలో చివరకు జిల్లా 'హస్త'గతం అయింది.



రేవంత్‌రెడ్డి ధృవీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం

- పీసీసీ, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి, డీసీసీబీ చైర్మన్ విజయం
- కొడంగల్, పరిగిలో ప్రతీ రౌండ్‌లో ఆధిక్యం
- తాండూరు, వికారాబాద్‌లో ఉత్కంఠ పోరు
- ఫలించని ఎంపీ ఎత్తుగడలు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
కొడంగల్	871	188	60
తాండూరు	978	316	166
పరిగి	1899	424	479
వికారాబాద్	1282	278	182

వికారాబాద్: జిల్లాలో హస్తం హవా కొనసాగింది. జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ క్లీన్ స్వీప్ తన సత్తా చాటుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం పరిగిలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో హస్తం పార్టీ అభ్యర్థులు స్పష్టమైన మెజార్టీ సాధించి విజయం సాధించారు. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ఆధిపత్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. తాండూరు మినహా మిగిలిన మూడు స్థానాల్లో పదివేల పైచిలుకు మెజార్టీ సాధించారు. ఎన్నికల కౌంటింగ్‌లో ఆద్యంతం హస్తం హవానే కొనసాగింది. ఓట్ల లెక్కింపు సగం రౌండ్స్ పూర్తికాగానే ఫలితాలు తేలాయి. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు కౌంటింగ్ కొనసాగుతుండగానే హాళ్లను విడిచి వెళ్లిపోయారు. పది రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తైనప్పుడే అభ్యర్థుల గెలుపు ఖరారు కావడంతో కాంగ్రెస్ శ్రేణులు కౌంటింగ్ కేంద్రం బయట టపాకాయలు పేల్చుతూ సందడి చేశారు.

పోగొట్టుకున్న చోటే రాబట్టారు

చేతి గుర్తుపై పోటీ చేసిన నలుగురిలో ముగ్గురు అభ్యర్థులు ఓడిన చోటే గెలిచి తమ సత్తా చాటుకున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై 32,720 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి అన్న చందంగా వికారాబాద్ సెగ్మెంట్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్, పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి వారి సొంత నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. టీఆర్‌ఆర్ తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్ రెడ్డిపై 23,995 ఓట్ల మెజార్టీతో విజయఢంకా మోగించారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మొదట, మధ్యలో కొన్ని రౌండ్లలో వెనుకంజలో ఉన్నా మళ్లీ పుంజుకుని తన సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్‌పై 12,672 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తాండూరు నుంచి మొదటి సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తొలిప్రయత్నంలోనే సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డిపై 6,583 ఓట్ల మెజార్టీ సాధించి విజయాన్ని ముద్దాడారు. నెల రోజుల క్రితమే కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఆయనకు ప్రజలు అనూహ్య విజయం కట్టబెట్టారు.

పారని అభివృద్ధి మంత్రం

అధికారంలోకి వచ్చాక మొదటి నాలుగు సంవత్సరాలు సైలెంట్‌గా ఉన్న అధికార పార్టీ చివరి ఏడాది అభివృద్ధి మంత్రాన్ని వల్లెవేసినా ఓటర్లు విశ్వసించలేదు. ప్రధానంగా వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఆరు నెలల క్రితం నుంచి రూ.వందల కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినా ఆ పార్టీ అభ్యర్థులను విజయ తీరాలకు చేర్చలేకపోయాయి. మంజూరు చేయించిన పనులకు సైతం చివరి నిమిషంలో ప్రారంభించడం .. శిలాఫలకం వేయడం తదితర కార్యక్రమాలు చేపట్టినా ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. పాత చింతకాయ పచ్చడిలా సీఎం కేసీఆర్ 2018 ఎన్నికల ప్రచారం మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ చెప్పడంతో ఓటర్లు పెడచెవిన పెట్టారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి నెల రోజులపాటు వికారాబాద్‌లోనే తిష్ట వేసి నేతలు పార్టీ వీడకుండా కట్టడి చేశారు. అసంతృప్తులను బుజ్జగించారు. కానీ ఇవేవీ ఆనంద్‌ను గెలిపించలేక పోయాయి.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ పై'చేయి'

జిల్లాలో ఉద్యోగులు అధికశాతం కాంగ్రెస్‌కే జై కొట్టారు. పోలైన పోస్టల్ బ్యాలెట్‌లో 80శాతానికి పైగా హస్తానికే వచ్చాయి. పార్టీలు, అభ్యర్థుల వారీగా పరిశీలిస్తే ఈ విషయం సుస్పష్టమవుతుంది.



మనోహర్‌రెడ్డి సోదరులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

కొడంగల్ నా ఊపిరి



నన్ను గుండెల్లో పెట్టుకుని ఆదరించిన ప్రజలకు రుణపడి ఉన్నా. నా గొంతులో ప్రాణమున్నంత వరకు కొడంగల్ అభ్యున్నతికి కృషి చేస్తా. నియోజకవర్గ ప్రజలు నా కుటుంబ సభ్యులు. వారే నా ఊపిరి. నాపై నమ్మకముంచి ప్రజలకు సేవచేసే అదృష్టం కల్పించినందుకు ధన్యవాదాలు. తనకు మద్దతు ఇచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు.

– రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొడంగల్

రైలు మార్గం తీసుకువస్తా



ఇచ్చిన హామీలు నెరవేరుస్తా. అధిక నిధులతో ఆదర్శనియోజవకర్గంగా తీర్చిదిద్దేంకు కృషి చేస్తా. నా చిరకాల స్వప్నమైన రైలు మార్గాన్ని తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తా. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తీసుకువచ్చి సాగునీరు అందిస్తా. పరిగి–హైదారాబాద్ నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించి అభివృద్ధి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

హామీలను అమలు చేస్తాం



ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తాం. నా గెలుపునకు సహకరించిన కార్యకర్తలు, నాయకులందరికీ ధన్యవాదములు. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారు. ఇది జిల్లా చరిత్రలో ఓ అద్భుత ఘట్టం. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచింది. అధికార పార్టీ నాయకుల అవినీతి, అహంకారపు చేష్టలే వారిని ఓడించాయి. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం.

– ప్రసాద్‌కుమార్,ఎమ్మెల్యే, వికారాబాద్

ఉద్యోగకల్పనే లక్ష్యం



ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాను. ఆరు గ్యారంటీ స్కీమ్‌లను ప్రతీ ఇంటికి అందేలా కృషి చేస్తాను. నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యం. నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు పారిశ్రామికవేత్తలను ఒప్పిస్తాను. జనవరి నుంచి తాండూరు–హైదరాబాద్ రోడ్డు మార్గం, నియోజకవర్గంలోని పాడైన రోడ్లను అభివృద్ధి చేస్తాం. కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ, ఆయకట్టు భూములకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తా. తన గెలుపునకు సహకరించిన వారికి కృతజ్ఞతలు.

– మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

అజాత శత్రువుకు అందలం

గురునాథ్‌రెడ్డికి కొత్త ప్రభుత్వంలో సముచిత స్థానం



ప్రియాంకా గాంధీకి గురునాథ్‌రెడ్డిని పరిచయం చేస్తున్న రేవంత్ రెడ్డి(ఫైల్)

కొడంగల్: నియోజకవర్గంలో తిరుగులేని నేత.. అజాత శత్రువుగా పేరుగాంచిన పెద్దాయన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తారనే ప్రచారం జోరందుకుంది. కొడంగల్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం ఆయన 80 ఏళ్ల వయస్సులోనూ ఎంతో శ్రమించారు. ఆయన వెంట ఆయన కుటుంబ సభ్యులు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, రావులపల్లి సర్పంచ్ రమేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి శక్తి వంచన లేకుండా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడికి భారీ మెజార్టీని కట్టబెట్టడంలో వారి పాత్ర కీలకం. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత నియోజకవర్గంలో ఆయన రెండు రోజులు మాత్రమే ప్రచారం చేశారు. రేవంత్‌రెడ్డి విజయాన్ని భుజాలమీద వేసుకున్న గురునాథ్‌రెడ్డి అన్ని మండలాల్లో పర్యటించి ఓట్లు రాబట్టారు. కొత్త ప్రభుత్వంలో ఆయనకు సముచిత స్థానం కల్పిస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆయనకు ఐదుసార్లు శాసనసభ్యుడిగా, ఒకసారి గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. గతంలో సీఎం కేసీఆర్ మాటిచ్చి తప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఆయన కారు దిగి కాంగ్రెస్ చేరి రేవంత్ గెలుపు కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలో గురునాథ్‌రెడ్డికి ఎమ్మెల్సీ లేదంటే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తారని చర్చ సాగుతోంది.

మేడ్చల్ ఖిల్లాపై గులాబీ జెండా

ఐదు సిట్టింగ్ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ జయకేతనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాపై గులాబీ జెండా ఎగిరింది. ఇక్కడ ఊహించని ఫలితాలు వెలువడ్డాయి. ఐదుకు ఐదూ బీఆర్‌ఎస్ నిలబెట్టుకుంది. ఈసారి ఓట్ల శాతం కూడా గణనీయంగా పెరిగింది. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఐదు స్థానాలను కైవసం చేసుకుంది. అదే చరిత్రను ఇప్పుడు పునరావృతం చేసింది. మేడ్చల్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డి రెండోసారి గెలుపొందగా.. కుత్బుల్లాపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటిసారి పోటీ చేసిన బండారి లక్ష్మారెడ్డి గెలుపొందారు. మల్కాజిగిరిలో కూడా చామకూర మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మొదటిసారి విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఓటమి పాలయ్యారు.

లక్కీ లీడర్ బీఎంఆర్

- నాన్‌లోకల్ ప్రచారాన్ని పట్టించుకోని ఓటర్లు
- 6,583 ఓట్ల ఆధిక్యంతో మనోహర్‌రెడ్డి విజయం

పార్టీ	అభ్యర్థి	పోలైన ఓట్లు
కాంగ్రెస్	మనోహర్‌రెడ్డి	84,662
బీఆర్‌ఎస్	రోహిత్‌రెడ్డి	78,079
బీజేపీ/జనసేన	శంకర్‌గౌడ్	4,087
బీఎస్పీ	చంద్రశేఖర్	2,546



గెలుపు అనంతరం టీఆర్‌ఆర్‌ను రామ్మోహన్ రెడ్డిని ఆలింగనం చేసుకున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ ప్యారాచూట్ నేతలకు కలిసొస్తుందని మరో మారు రుజువయింది. ఎన్నికలకు 45 రోజుల ముందర హస్తం గూటికి చేరిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికే నియోజకవర్గ ప్రజలు జైకొట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై 6,583 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పైలట్ ఓటమికి స్వయంకృతాపరాధమే అంటూ సొంత పార్టీ నేతలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నువ్వా.. నేనా

పరిగిలోని మార్కెట్ యార్డులో తాండూరు ఎన్నికల కౌంటింగ్ చేపట్టారు. మొత్తం 14 టేబుల్స్, 20 రౌండ్ల చొప్పున ఓట్లను లెక్కించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నడుమ హోరా హోరీ పోరు నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి పోస్టల్ బ్యాలెట్‌లో 662 ఆధిక్యం కనబరిచారు. అనంతరం మొదటి రెండు రౌండ్లలో బీఆర్‌ఎస్ స్వల్ప ఆధిక్యతను కనబరిచింది. పెద్దేముల్ మండలంలో 1033 ఓట్లతో కాంగ్రెస్ ముందజలో నిలిచింది. తాండూరు మండలం నువ్వా నేనా అనే విధంగా పోటీపడ్డాయి. ఇక్కడ పైలట్‌కు 533 ఓట్లు ఆధిక్యత వచ్చింది. తాండూరు మున్సిపల్ ఓటర్లు చేయికి జై కొట్టడంతో కాంగ్రెస్‌కు దాదాపు 4,500 ఓట్ల లీడ్ ఇచ్చారు. యాలాల మండలంలోనూ హస్తానికి 1987 ఓట్లు అధికంగా పోలయ్యాయి. చివరగా కౌంటింగ్ జరిగిన రోహిత్‌రెడ్డి సొంత మండలం బషీరాబాద్‌లో స్వల్ప ఆధిక్యత లభించింది. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిని 6,583 మెజార్టీతో గెలిపించారు. నియోజకవర్గంలో బషీరాబాద్, తాండూరు మండలాలు పైలెట్ రోహిత్‌రెడ్డికి అండగా నిలవగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి పెద్దేముల్, తాండూరు మున్సిపాలిటీ, యాలాల మండలాలు అనుకూల తీర్పునిచ్చాయి. కౌంటింగ్ కేంద్రం వద్ద బుయ్యని మనోహర్‌రెడ్డి పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎంఆర్‌కు డీసీసీ అధ్యక్షుడు టీఆర్‌ఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కౌంటింగ్ ముగిసిన వెంటనే ఎన్నికల అధికారులు మనోహర్‌రెడ్డి విజయం సాధించినట్లుగా ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ పత్రాన్ని మనోహర్‌రెడ్డి సోదరులు అందుకున్నారు.

డిపాజిట్లు గల్లంతు

బీజేపీ, సీపీఎంలకు గతంలో కంటే తగ్గిన ఓట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించాడు. 35 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందాడు. నియోజకవర్గంలో 2,45,302 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి రంగారెడ్డికి 1,24,447 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. మూడుసార్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పనిచేశారు. గతంలో 72356 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం గతం కంటే 12 వేల ఓట్లు అత్యధికంగా సాధించారు.

సీపీఎం, బీజేపీలకు డిపాజిట్ల గల్లంతు

పట్నంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఎం ప్రభావం తగ్గిపోతుంది. 1989లో 1994, 2004లో సీపీఎం అభ్యర్థులు ఎమ్మెల్యేలు గెలిచారు. అప్పటి నుంచి బలమైన పార్టీగా ఉన్న సీపీఎం రాను రాను ప్రభావం తగ్గిపోయింది. 2018 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి9,560 ఓట్లు సాధించింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 3,877 వచ్చాయి.

బీజేపీకి తగ్గిన ఓట్లు..

బీజేపీకి గ్రామీణస్థాయిల్లో బలమైన కేడర్ ఉంది. ఇక్కడ బీజేపీ నుంచి పోటీ చేసిన నోముల దయానంద్‌గౌడ్ అంతగా ప్రభావం చూపలేక పోయాడు. 2018 ఎన్నికల్లో 19వేలకు పైచిలుకు ఓట్లు వస్తే ప్రస్తుతం 15064ఓట్లు వచ్చాయి. గత ఓటర్లను కాపాడుకోలేక పోయారు. మొత్తానికి ఇబ్రహీంపట్నంలో సీపీఎం, బీజేపీలు డిపాజిట్లు కోల్పోయారు.



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొడంగల్ జిగేల్



సంబురాల్లో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం

కొడంగల్: అన్ని రంగాల్లోనూ వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గం రూపురేఖలు సమీప భవిష్యత్‌లోనే మారనున్నాయి. కొడంగల్ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించడంతో ఆయనకు సీఎం అయ్యేందుకు అవకాశం వచ్చిందని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్య, ఉపాధి, వైద్యం, రవాణా కనీస మౌలిక సదుపాయాలతో పాటు ఈ ప్రాంతాన్ని ప్రత్యేక నిధులతో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తారని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడంతో పాటు కొడంగల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి భారీ మెజారిటీ రావడంతో ఆదివారం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టపాకాయలు కాల్చి ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు. కొడంగల్‌లో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి విజయంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సంబురాల్లో రావులపల్లి సర్పంచ్ రమేష్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, మురహరి వశిష్ఠ, మిఠాయి రాజు, కృష్ణంరాజు, ఏన్గుల భాస్కర్, సోమశేఖర్, గౌసన్, దాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికను తప్పించబోయి..

భైక్ అదుపు తప్పి హోంగార్డు మృతి

బొంరాస్‌పేట: రోడ్డుపై బైక్‌కు అడ్డంగా వచ్చిన బాలికను తప్పించబోయి జరిగిన ప్రమాదంలో ఓ హోంగార్డుకు మృతి చెందాడు. దౌల్తాబాద్ మండలం అల్లాపూర్‌కు చెందిన కృష్ణయాదవ్(35) హైదరాబాద్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం కొడంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కృష్ణ యాదవ్ బైక్‌కు బొంరాస్‌పేట మండలం బొట్లోని తండా ఆశ్రమ పాఠశాల వద్ద అకస్మాత్తుగా వైశాలి అనే బాలిక అడ్డుగా వచ్చింది. ఆమెను తప్పించబోయిన కృష్ణయాదవ్ బైక్ అదుపుతప్పి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు.. కృష్ణయాదవ్‌ను వెంటనే కొడంగల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బాలిక ఎడమ కాలికి స్వల్ప గాయాలయ్యాయని.. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వగ్రామంలో ఆనంద్‌కు షాక్

ధారూరు: సొంత మండలం, సొంత గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు ఓటర్లు షాక్ ఇచ్చారు. ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు ధారూరు మండలంలో 2,774 ఓట్ల మెజార్టీ వచ్చింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ స్వగ్రామమైన కేరెళ్లి గ్రామ ఓటర్లు సైతం ఆయనకు షాక్ ఇచ్చారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 116 ఆధిక్యత వచ్చింది. 2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కూడా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి 1,105 ఆధిక్యత సాధించారు. ధారూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోట అని మరోసారి రుజువైందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రసాద్‌కుమార్ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయారు.

ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ రాకుండా చేస్తాం


ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఇచ్చి తల్లి సోనియమ్మ రుణం తీర్చుకున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. కేసీఆర్ పదవీ అహంకారంతో విర్రవీగారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను సర్వనాశనం చేశారని అన్నారు. వ్యవసాయ రంగానికి ఉన్న రాయితీలన్నీ రద్దు చేసి రైతాంగాన్ని ఆగం చేశారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 40 వేలకు పైగా మెజార్టీ రావడం సంతోషంగా ఉందన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులో కేసీఆర్ సర్కార్ తలపెట్టిన ఫార్మాసిటీని రద్దు చేస్తామన్నారు. టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసిన రైతుల పట్టా భూముల రికార్డులను సరి చేసేలా కృషి చేస్తామని అన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులను కేసీఆర్ సర్కార్ అనేక ఇబ్బందులుపెట్టిందని, కేసులు నమోదు చేయించి జైలుకు పంపిందని అన్నారు. అలాగే మండలంలో తలపెట్టిన మైనింగ్ జోన్‌ను రద్దు చేస్తామని చెప్పారు. యాచారం, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో స్టోన్ క్రషర్లు, క్వారీలు రాకుండా చూస్తామని తెలిపారు.

ఏజెంట్ల ఆందోళన

షాద్‌నగర్: ఓట్ల లెక్కింపు కేంద్రంలో అధికారులు.. కౌంటింగ్ ఏజెంట్లకు సరైన సామగ్రిని సమకూర్చకపోవడంతో ఏజెంట్లు కొద్ది సేపు ఆందోళన చేపట్టారు. షాద్‌నగర్ అసెంబ్లీకి సంబంధి ఓట్ల లెక్కింపును ఆదివారం హయత్‌నగర్ మండలం గండిపేట సమీపంలోని లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా కేంద్రంలో అధికారులు రాక్స్, పేపర్లు, సదుపాయాలు సరిగా కల్పించలేదని ఆరోపిస్తూ కౌంటింగ్‌కు వెళ్లిన ఏజెంట్లు కొద్ది సేపు ఆందోళన చేపట్టారు.

ఆలస్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

క్యూఆర్‌కోడ్ సరిగా ఓపెన్ కాకపోవడంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యంగా కొనసాగింది. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కించి అరగంటలో ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. కానీ 10గంటలకు నేరుగా ఈవీఎం యంత్రాలకు సంబంధించి మొదటిరౌండ్ ఫలితాలను అధికారులు వెల్లడించారు. సాయంత్రానికి అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను వెల్లడించారు. మొత్తం 1,595 ఓట్లు పోలవ్వగా అందులో 32 ఓట్లను రిజెక్టు చేశారు. 35 ఓట్లను ఇన్‌వ్యాలిడ్‌గా ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 870 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 304, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీకి 225, బీజేపీకి 86, నోటాకు 5 ఓట్లు పోలయ్యాయి.

ఆరు గ్యారెంటీలు అమలుచేస్తాం


వికారాబాద్ అర్బన్: ప్రసాద్‌కుమార్‌ను సన్మానించిన చైరపర్సన్ మంజుల, నాయకులు

- వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్
- నియోజకవర్గంలో నేతల సంబురాలు

వికారాబాద్ అర్బన్: రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచిందని.. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలు తనకు సుమారు 12,500 మెజార్టీతో పట్టం కట్టారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తానని తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన విజయం సాధించడంతో పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయారు.

పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు

కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ విజయానికి దోహదపడిన వికారాబాద్ పట్టణ ఓటర్లకు ఎప్పుడూ రుణపడి ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. ఆదివారం కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న ప్రసాద్ కుమార్‌ను చైర్‌పర్సన్ మంజుల ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి సుమారు 4వేల ఓట్ల ఆధిక్యత వచ్చిందన్నారు. ప్రసాద్‌కుమార్ సహకారంతో భవిష్యత్‌లో వికారాబాద్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె తెలిపారు.

ధారూరు మండలంలో..

ధారూరు: వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో ధారూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలు, తండాల్లో డీజేలు, బ్యాండ్ మేళాలతో రేవంత్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ధారూరు మండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, నాయకులు ఉన్నారు.

మర్పల్లిలో సంబురాలు

మర్పల్లి: వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ సుమారు 12వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందటంతో మర్పల్లి మండలంలో ఆపార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్లు ముందుగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు విమలమ్మ, నాయకులు దివాకర్, గణేశ్, మల్లేశ్‌యాదవ్, సర్వేశ్, ప్రభాకర్ రెడ్డి, శ్రావణ్, బలవంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, జాఫర్, రతన్ తదితరులు ఉన్నారు.

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో..

బంట్వారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

ముందే వెళ్లిపోయిన ఆనంద్

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆనంద్ ఆరు రౌండ్లు మిగిలి ఉండగానే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు. వికారాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 21 రౌండ్లు ఉండగా 15వ రౌండ్ ముగిసే సరికి కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ సుమారు 7,500 లీడ్‌లో ఉన్నారు. మిగలా రౌండ్లలో బంట్వారం, ధారూరు మండలాలు ఉండటంతో అక్కడ కాంగ్రెస్ బలంగా ఉందనే విషయం తెలిసిన ఆనంద్.. తన గెలుపు అసాధ్యమని గ్రహించి అనుచరులతో కౌంటింగ్ కేంద్రం నుంచి ముందే వెళ్లిపోయారు.

యాదయ్య హ్యాట్రిక్

- బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టిన చేవెళ్ల ఓటర్లు
- 268 ఓట్లతో గట్టెక్కిన కాలె యాదయ్య



నవాబుపేట: గత మూడు పర్యాయాలుగా శాసనసభ సాధారణ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఒక వైపు పవనాలు వీస్తే చేవెళ్లలో మాత్రం మరో వైపు వీశాయి. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న నవాబుపేట మండలాన్ని చేవెళ్ల నియోజకవర్గంలో కలిపారు. దీంతో అప్పటి వరకు జనరల్ నియోజకవర్గంగా ఉన్న చేవెళ్ల అసెంబ్లీ స్థానం ఎస్సీకి రిజర్వుడ్ అయ్యింది. నవాబుపేట మండలంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతోనే చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ చేవెళ్లలో మాత్రం టీడీపీ అభ్యర్థి కేఎస్.రత్నంకు గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చేవెళ్ల కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. మాజీ మంత్రులు ఇంద్రారెడ్డి, సబితారెడ్డికి తిరుగులేని స్థానంగా ఉండేది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేవెళ్లను సెంటిమెంట్‌గా భావించేవారు. ఏ కార్యక్రమం తీసుకున్నా చేవెళ్ల నుంచి ప్రారంభించేవారు. అలాంటి కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న చేవెళ్ల స్థానం ఎస్సీకి రిజర్వుడ్ కాగానే కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారాయి. మొదటిసారిగా టీడీపీ అభ్యర్థి కేఎస్.రత్నం, కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్య మీద 2,250 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అనంతరం కేఎస్.రత్నం టీడీపీకి రాజీనామా చేసిన 2014 సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో కేఎస్ రత్నం టీఆర్‌ఎస్ తరుపున పోటీ చేయగా.. కాలె యాదయ్య రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారం చేపట్టగా.. చేవెళ్లలో మాత్రం మళ్లీ రివర్స్ తీర్పు వచ్చింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్య 681 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గెలుపు అనంతరం యాదయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి అప్పుడు అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్‌లో చేరారు.

2018లో మళ్లీ ఇరువురు పోటీ...

2018లో జరిగిన ఎన్నికలకు ముందు వరకు కాలె యాదయ్య ఎమ్మెల్యేగా.. రత్నం సైతం టీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారు. టీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన రత్నంకు టికెట్ ఇవ్వకుండా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న యాదయ్యకే అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో కేఎస్.రత్నం టీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి బరిలోకి దిగారు. అయినా చేవెళ్ల ప్రజలు మళ్లీ టీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకే పట్టం గట్టారు. దీంతో యాదయ్య మొదట కాంగ్రెస్ తరుపున, రెండోసారి టీఆర్‌ఎస్ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఈ సారి (2023) రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ గాలివీయగా చేవెళ్లలో మాత్రం మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్య స్వల్ప మెజార్టీ (268 ఓట్లు)తో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై గెలుపొందారు. నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ సాధించారు.

సొసైటీ డైరెక్టర్‌గా రాజకీయ అరంగేట్రం

పేద కుటుంబం నుంచి వచ్చిన కాలె యాదయ్య.. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. రైల్వేలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా పని చేసుకొనే కాలె.. సింగిల్ విండో డైరెక్టర్‌గా రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం సభ్యుల సహకారంతో చించల్‌పేట సింగిల్ విండో చైర్మన్, అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి నవాబుపేట జెడ్పీటీసీగా గెలుపొందారు. ఆ తరువాత చించల్‌పేట ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. 2008లో వికారాబాద్ అసెంబ్లీకి(అప్పడు నవాబుపేట మండలం వికారాబాద్‌లో ఉంది) జరిగిన ఉప ఎన్నికల్లో టికెట్ ఆశించినప్పటికీ రాలేదు. దాంతో నిరాశకు గురైన యాదయ్యకు, వైఎస్సార్.. టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. 2009లో చేవెళ్ల టికెట్ దక్కినప్పటికీ 2,249 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దాంతో కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ కార్యదర్శిగా నియమించింది. 2014 సాధారణ ఎన్నికల్లో పార్టీ.. మరోసారి యాదయ్యకు టికెట్ ఇవ్వగా.. 781 స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. గెలిచిన ఏడాది అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి టికెట్ పొంది రెండోసారి ఎన్నికయ్యారు. 2023లో అదే పార్టీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై 262 ఓట్ల మెజార్టీతో చేవెళ్ల ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించారు. తనకు మూడుసార్లు విజయం అందించిన చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

బాల్యం నుంచే చదివే అలవాటు చేయాలి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బందెప్పగౌడ్

అనంతగిరి: భగవద్గీత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే గ్రంథమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బందెప్పగౌడ్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సంకల్ప్ విద్యాపీఠంలో భగవద్గీత జిల్లాస్థాయి శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బందెప్పగౌడ్ మాట్లాడుతూ.. భగవద్గీత ప్రతి మనిషి జీవితానికి శక్తివంతమైన ఔషధమన్నారు. ఇది కష్టాలు తట్టుకునే శక్తిని అందిస్తుందన్నారు. బాల్యం నుంచే పిల్లలకు చదివే అలవాటు చేస్తే వారికి ఆధ్యాత్మిక ఆలోచనలు అలవడుతాయన్నారు. పోటీల్లో.. పూర్వ ప్రాథమిక స్థాయిలో జాహ్నవి, ప్రాథమిక స్థాయిలో కాత్యాయని, మాధ్యమిక స్థాయిలో రేవంత్, ఉన్నత స్థాయిలో అక్షర, కళాశాల స్థాయిలో మహేందర్ ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి, ప్రశాంత్, శిరీష, ప్రభాకర్, కృష్ణ, ధనకోటి, జయశ్రీ, సంతోష, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న అతిథులు

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం


పరిగి: కౌంటింగ్ కేంద్రం నుంచి ర్యాలీగా వెళ్తున్న రామ్మోహన్‌రెడ్డి


కుల్కచర్ల: స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నేతలు

- పరిగి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్
- పోలింగ్ కేంద్రం నుంచి కాంగ్రెస్ నేతల భారీ ర్యాలీ

పరిగి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పరిగిలో తమ అభిమాన నేత టీ.రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ఆ పార్టీ నాయకులు సంబురాల్లో మునిగిపోయారు. ఆదివారం కార్యకర్తల భారీ ర్యాలీ నడుమ కౌటింగ్ కేంద్రం నుంచి టీఆర్‌ఆర్ నివాసం వరకు టపాసులు కాల్చుతూ వేడుకలు జరుపుకున్నారు. 9 సంవత్సరాలుగా పార్టీ అధికారంలో లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఇప్పుడు రాష్ట్రంలో, పరిగిలో ఒకేపార్టీ అధికారంలో ఉందని నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని టీఆర్‌ఆర్ ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ సేవలు ఎంతో అవసరమని ప్రజల శ్రేయస్సుకోసం పనిచేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు.

కుల్కచర్లలో నేతల సంబురాలు

కుల్కచర్ల: పరిగి ఎమ్మెల్యేగా టీ.రామ్మోహన్‌రెడ్డి గెలుపొందడంతో ఆదివారం మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదలకు మేలు జరగాలన్నా, ఎటువంటి రాజకీయాలు లేకుండా సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమని గ్రహించిన ప్రజలు ఆ పార్టీకి పట్టంకట్టారని అన్నారు. టీఆర్‌ఆర్ గెలుపునకు సహకరించిన ప్రతి కార్యకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు శివరాంనాయక్, నాయకులు వెంకటయ్య, లాలు, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేతల బైక్‌ర్యాలీ..

దోమ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు అంబరాన్నంటాయి. వికారాబాద్ జిల్లాలో పార్టీ క్లీన్‌స్వీప్ చేయడాన్ని హర్షిస్తూ ఆదివారం ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. టీఆర్‌ఆర్ గెలుపును హర్షిస్తూ దోమ మండల వ్యాప్తంగా నాయకులు బైక్ ర్యాలీలు తీశారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం

- కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి స్వగ్రామంలో సంబురాలు

బషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి విజయంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఆదివారం ఆ పార్టీ శ్రేణులు బషీరాబాద్‌లో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, వారి కుటుంబం, ఎంపీపీ కరుణ దంపతులు, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర నాయకులు ప్రచారం చేశారు. మేజర్ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ పార్టీ పైచేయి సాధించినప్పటికీ వారికి చివరకు నిరాశే మిగిలింది. తండాలు పూర్తిగా కాంగ్రెస్‌కు అండగా నిలిచాయి.

తిర్మలాపూర్‌లో సంబురాలు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బుయ్యని మనోహర్ రెడ్డి కుల్కచర్ల మండల ప్రాథమిక సహకార సంఘ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తూనే అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించేందుకు ప్రయత్నించగా అధికార పార్టీ నుంచి నిరాశ ఎదురయ్యింది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి తాండురు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం లభించడంతో తాండురు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో నిలిచారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో తాండురు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన స్వగ్రామం తిర్మలాపూర్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. కుల్కచర్ల మండల వ్యాప్తంగా మనోహర్ రెడ్డి విజయం పట్ల విజయోత్సవాలను నిర్వహించారు.


కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నేతలు

మరింత కష్టపడి పనిచేద్దాం

- బీఆర్‌ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్ రెడ్డి ఆదివారం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండు రౌండ్లు మిగిలి ఉండగానే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చేశారు. యాలాల మండలం బీఆర్‌ఎస్ పార్టీకి భారీ ఆధిక్యం తెచ్చిపెడుతోందని అంతా భావించారు. అయితే అనుహ్యంగా కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ కట్టబెట్టింది. అప్పటికే మనోహర్‌రెడ్డి దాదాపు 6వేల వరకు ఆధిక్యంలో ఉన్నారు. బషీరాబాద్ మండలానికి సంబంధించి రెండు రౌండ్ల వరకు కూర్చొని ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి సొంత మండలంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని గ్రహించి కౌటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చేశారు. ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఒక్కసారిగా పైలెట్ దగ్గరకు వచ్చి కన్నీటి పర్యంతమవ్వగా వారిని ఆయన సముదాయించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీచిందన్నారు. అధైర్యపడవద్దని.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్‌లో మరింత కష్టపడి పనిచేద్దామని, వారికి భరోసానిచ్చారు.


కార్యకర్తలను ఓదారుస్తున్న రోహిత్‌రెడ్డి

వీర్లపల్లి గెలుపులో చౌలపల్లి

షాద్‌నగర్: గత ఎన్నికల్లో వారిద్దరు ప్రత్యర్థులు.. ప్రస్తుతం ఎన్నికల్లో ఒక్కటై కలిసి పని చేశారు. చేజారిన కంచుకోటను తిరిగి దక్కించుకొని కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు. షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపులో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇద్దరు నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయఢంకా మోగించారు.

కీలకంగా ప్రతాప్‌రెడ్డి..

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. అక్కడ టికెట్ ఆశించి భంగపడటంతో తిరిగి ఆయన తన అనుచరగణంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శంకర్ గెలుపులో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాం సుందర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు.

15వ ఎమ్మెల్యేగా వీర్లపల్లి

షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు అయినప్పటీ నుంచి నేటి వరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ 10సార్లు, టీడీపీ 2సార్లు, టీఆర్ఎస్ 2సార్లు విజయం సాధించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్ బీఆర్‌ఎస్‌పై విజయం సాధించారు.

నమ్మినవారే.. నట్టేట ముంచారా?

- కొడంగల్‌లో నరేందర్‌రెడ్డికి ఘోర పరాభవం
- పోలింగ్‌కు ముందు రోజే అస్త్ర సన్యాసం చేసిన అనుచరులు
- ప్రతిపక్షానికి అనుకూలంగా పనిచేశారంటూ ఆరోపణలు

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలో ప్రజా నాయకుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి(పీఎస్‌ఆర్)ని నమ్మిన వాళ్లే నట్టేట ముంచారు. నామినేషన్ వేసి ఇంట్లో కూర్చున్నా గెలిపించే అభిమానులు నరేందర్‌రెడ్డికి ఉన్నారు. అయితే ఆయన నమ్ముకున్న నాయకులు ఎన్నికల సమయంలో సరిగ్గా పనిచేయలేదనే విమర్శలున్నాయి. పోలింగ్‌కు ముందు కార్యకర్తలు సరిగా పనిచేయకపోవడం, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పాటు పోలింగ్ రోజు నుంచే సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో పట్నం నరేందర్‌రెడ్డి అభిమానులు, ఆయనకు ఓటువేద్దామనుకున్న ఓటర్లు ఒకింత అయోమయానికి గురైనట్లు సమాచారం. దీనికి తోడు కొంతమంది పనిగట్టుకుని నరేందర్‌రెడ్డి గెలుస్తున్నాడని ఆయనకు ఢోకా లేదని ప్రచారం చేశారు. ఈ పరిణామం కూడా నరేందర్‌రెడ్డి ఓటమికి కారణమైంది. కొడంగల్ కోస్గి మున్సిపాలిటీలతో పాటు 8 మండలాల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. కనీసం పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు లేని దయనీయ పరిస్థితి ఏర్పడింది. అధికార పక్షానికి ఇంతటి దుస్థితిని కల్పించిన వ్యక్తులు ఎవరో ఇప్పటికైనా నరేందర్‌రెడ్డి గ్రహించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు. అయితే కొడంగల్‌లో ఆ ప్రజా నాయకుడికి ఓటమి తప్పదని 'సాక్షి' ముందే చెప్పింది. పోలింగ్‌కు ముందు సాక్షి ప్రచురించిన కథనాలు నిజం అయ్యాయని కార్యకర్తలు అంటున్నారు. నిత్యం పీఎస్‌ఆర్ పక్కన ఉండే నేతల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ క్షేత్రస్థాయి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే దగ్గర డబ్బులు తీసుకున్న ద్వితీయ శ్రేణి నేతలు జనాలకు చేరవేయలేదని చెబుతున్నారు. స్థానికంగా ప్రచారం కూడా సరిగా చేయలేదని విమర్శలున్నాయి. నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాల్సిన నాయకులు చివరి క్షణంలో అస్త్ర సన్యాసం చేసి ప్రతిపక్షానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. మున్సిపాలిటీలు, మండలాల్లో అధికార పక్షం నేతలు అమ్ముడుపోయి సైలెంట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దౌల్తాబాద్ మండలంలో జరిగిన సంఘటనే దీనికి ఒక ఉదాహరణగా కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పటికైనా నమ్మినవాళ్లు ఎవరో నమ్మక ద్రోహం చేసిన వారు ఎవరో నరేందర్‌రెడ్డి గ్రహించాలని ఆయన అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు.


ఎన్నికల ప్రచారంలో నరేందర్‌రెడ్డి (ఫైల్)